క్లుప్తంగా

అధికారుల నిర్లక్ష్యం వల్లే మురుగు సమస్య : కార్పొరేటర్

మన్సూరాబాద్: జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్, జలమండలి సివరేజ్‌బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే డ్రైనేజీ సమస్య తలెత్తుతోందని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీని జలమండలి డీజీఎం మాధవితో కలిసి కార్పొరేటర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురుగు కుంటలామారిందని, తీవ్ర దుర్వాసనతో సహారాస్టేట్స్‌కాలనీ, వివేకానందనగర్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డగోలుగా బహుళ అంతస్తులకు అనుమతులిస్తున్నారని, దీంతో సమస్య తీవ్రంగా మారిందని మండిపడ్డారు. కాలనీలవాసులు శ్యాంసుందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, రవీందర్‌రెడ్డి, రవిచంద్ర పాల్గొన్నారు.

సందడి చేసిన విద్యార్థులు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంబ్రిడ్జ్ విద్యార్థులు

సైదాబాద్: పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు చిన్నప్పటినుంచే వివరించాలని కేంబ్రిడ్జ్ విద్యాసంస్థల అధిపతి కె.శంతన్‌కుమార్ సూచించారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఝాన్సి పాల్గొన్నారు.

చైతన్యపురి: పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎస్ బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలను పూల దండలు, తోరణాలతో అలంకరించారు. ఉగాది పచ్చడి తయారు చేసి ప్రత్యేక పూజల అనంతరం అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చంద్రశేఖర్, రాధ, ప్రిన్సిపల్ రాధ పాల్గొన్నారు.

లోటస్‌ల్యాప్ స్కూల్‌లో...

దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ఉగాది పచ్చడిని విద్యార్థులు స్వయంగా తయారు చేసి అందరికీ పంచిపెట్టారు. పాఠశాల చైర్మన్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ మంజులారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మధవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగోలు: కొత్తపేట డివిజన్ శ్రీ శంకర్ కాలనీలోని సెయింట్ ఆల్ఫాన్సా గ్రామర్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో పాఠశాల డైరెక్టర్లు దేవేందర్‌గౌడ్, రమాదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి పాల్గొన్నారు.

ఉగాది సందడిలో...

- ఆలయాల ముస్తాబు
- నేటి సాయంత్రం పంచాంగ శ్రవణం

దిల్‌సుఖ్‌నగర్: శ్రీశోభాకృత్ నామ ఉగాది పర్వదినానికి సర్వం సిద్ధమైంది. తెలుగువారి తొలిపండుగ ఉగాది. చైత్ర శుద్ధ పాడ్యమినాడు తెలుగువారంతా తమ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో జరుపుకునే మొట్ట మొదటి పండగ ఉగాది. ఈ నూతన సంవత్సరం అందరినీ ఆనందంగా పలకరించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- బుధవారం శ్రీశోభాకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మలక్‌పేట్ నియోజకవర్గం పరిధిలో ప్రజలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. నేటి సాయంత్రం నుంచి పలు ఆలయాల్లో పంచాగ శ్రవణం చేయనున్నారు.

ఆలయాల ముస్తాబు...

- దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, మలక్‌పేట్, సరూర్‌నగర్, అక్బర్‌బాగ్, సైదాబాద్, ఓల్డ్‌మలక్‌పేట్, ఐఎస్‌సదన్, మాదన్నపేట్ తదితర ప్రాంతాల్లోని అన్ని దేవాలయాలను నిర్వాహకులు ప్రత్యేక పూజలకోసం సిద్ధం చేశారు.
- ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆకాశాన్నంటిన పూలు, పండ్లధరలు..

- ఉగాది పండుగ సందర్భంగా వ్యాపారస్తులు పూలు, పండ్ల ధరలను అమాంతం పెంచేశారు. మామూలు రోజుల్లో ఉండే ధరలకు నాలుగు రెట్లు అధికంగా అమ్ముతున్నారు.
- బంతిపూలు ప్రస్తుతం కిలో రూ. 120–150, వేపపూత రూ.5 నుంచి 10 రూపాయల వరకు అమ్ముతున్నారు. మట్టి కుండలు రూ.70 నుంచి రూ.300 వరకు ధర పలుకుతున్నాయి. పలు ప్రాంతాలలో మట్టికుండలకు గిరాకీ బాగా పెరిగింది.




సరూర్‌నగర్ రైతుబాజర్‌లో పూలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



హుడా పార్కులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మంగళవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న హుడా పార్కులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే తరాలకు పచ్చదనంతో కూడిన ప్రపంచాన్ని అందించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించుకొని ధరిత్రిని కాపాడుకోవాలని అన్నారు.



కొత్తపేట డివిజన్‌లో నూతన రోడ్లు వేయాలి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని రోడ్లన్నీ గుంతలు ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే డివిజన్‌లో నూతన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ మంగళవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ పంకజను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం దృష్ట్యా కొత్తపేట డివిజన్‌లోని కాలనీలలో నూతన సీసీ రోడ్లు బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తపేట డివిజన్ లో మంజూరై టెండర్లు అయిన పనులను మొదలు పెట్టి తొందరగా పూర్తి చేయాలని కోరారు. స్పందించిన జోనల్ కమిషనర్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

బాక్స్‌డ్రెయిన్ పనులు వేగంగా పూర్తి చేయాలి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం శంకేశ్వరబజార్ చౌరస్తా వద్ద కొనసాగుతున్న బాక్స్‌డ్రెయిన్ పనులను స్థానికులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరూర్‌నగర్ చెరువు నుండి సైదాబాద్ వైపుగా శంకేశ్వరబజార్ చౌరస్తా వద్ద జరుగుతున్న పనుల కారణంగా ఈ ప్రధానరహదారిపై రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో రేయాన్ విద్యార్థుల ప్రతిభ



ఆలిండియా స్థాయిలో ప్రతిభ కనబరిచిన రేయాన్ సైనిక్ స్కూల్స్ విద్యార్థులు



విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తున్న దృశ్యం

జాతీయ స్థాయిలో 62 సీట్లు సాధించిన విద్యార్థులు

నాగోలు: దేశ వ్యాప్తంగా నిర్వహించిన సైనిక్ స్కూల్స్ 2023 ఫలితాలలో నాగోలు బండ్లగూడలోని రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు 63 మంది ఎంపికయ్యారని రేయాన్ సైనిక్ స్కూల్స్ చైర్మన్ జి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. రేయాన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో విద్యార్థులను సన్మానించి బంగారు పతకాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 33 స్కూల్స్, 18 కొత్త సైనిక్ స్కూల్స్‌కు తమ వద్ద చదువుకున్న 63 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. అత్యధిక మార్కులు (281) సాధించడంతో పాటు తెలుగు రాష్ట్రాలలో మొదటి, రెండవ, నాల్గవ, ఆరవ, ఎనిమిదవ స్థానాలు సాధించినట్లు తెలిపారు. డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రేయాన్ సంస్థ నుంచి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకుతో పాటు అత్యధిక సీట్లతో స్కూల్ కోచింగ్‌లో అగ్రస్థానంలో ఉన్నామని తెలిపారు. గత 23 సంవత్సరాలుగా కొన్ని వేల మంది విద్యార్థులు సైనిక్, నవోదయ విద్యాలయాలకు ఎంపిక అవుతున్నారని పేర్కొన్నారు.

కేటీఆర్‌ను ముద్దాయిగా చేర్చాలి

చంచల్‌గూడ: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రాల లీకులో మంత్రి కేటీఆర్‌ను ప్రధాన ముద్దాయిగా చేర్చాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంలో నిరసన తెలిపిన బీజేవైయం అధ్యక్షుడు భానుప్రకాశ్‌తో పాటు మరికొందరు నాయకులను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలు తరలించిన విషయం తెలిసిందే. జైల్లో ఉన్న భానుప్రకాశ్ తదితరులను మంగళవారం ఆయన ములాఖత్‌లో కలిసి పరామర్శించారు. ఈ వ్యవహారంపై పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మాజీ కార్పొరేటర్ జన్మదిన వేడుకలు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి జన్మదిన వేడుకలు కేబీఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగాయి. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీలవాసులు, బీఆర్ఎస్ నేతలు, మిత్రులు పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించి కేక్‌ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి పాల్గొన్నారు.



కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

- భర్త వేధింపులు భరించలేక బలవన్మరణం
- కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మలక్‌పేట : ప్రేమించి పెళ్లి చేసుకున్న అనంతరం భర్త (కానిస్టేబుల్) పెట్టే వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మలకోపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్‌కు చెందిన శ్రీనివాస్ కుమార్తె పవిత్ర(27), తిరుమలగిరిలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అవినాష్ 2016 జూన్ 6న ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం మలక్‌పేటలోని బి–బ్లాక్ క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. వారికి ఓ కూతురు అవిక్షిత (5) ఉంది. అయితే కూతురు పుట్టినప్పటినుంచీ అవినాష్ ప్రవర్తనలో మార్పువచ్చింది. తాగుడుకు బానిసై అదనపు కట్నం కోసం భార్యను వేధించసాగాడు. మద్యం మత్తులో పవిత్రను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ విషయమై మహిళా పోలీసుల వద్ద అతనికి కౌన్సిలింగ్ కూడా ఇప్పించారు. అయినా అతని ప్రవర్తన మారలేదు. ప్రవర్తన మార్చుకుంటానని, మద్యం మానేస్తానని మామ శ్రీనివాస్‌కు చెప్పగా.. కారు కొనుకోవడానికి రూ.2 లక్షలు ఇచ్చాడు. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం అవినాష్ డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. సాయంత్రం 4.30 గంటలకు అత్త రేణుకకు ఫోన్‌చేసి అరగంట నుంచి తనతో పవిత్ర గొడవ పడుతోందని చెప్పాడు. సాయంత్రం మామకు ఫోన్ చేసి పవిత్ర చీరతో ఉరేసుకుని చనిపోయిందని చెప్పాడు. అల్లుడు అవినాష్ అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేయడంతోనే తన కూతురు చనిపోయిందని మృతురాలు తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు అవినాష్‌ను అదుపులోకి తీసుకున్నారు.



మహావీర్ కళాశాలకు న్యాక్ గుర్తింపు

సైదాబాద్: పాతబస్తీ బండ్లగూడలోని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) నుండి గ్రేడ్–ఏ గుర్తింపు లభించిందని కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సైదాబాద్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గతవారం న్యాక్ అధికారుల బృందం కళాశాలలో నిర్వహించిన పరిశీలన అనంతరం ఈ గుర్తింపును ప్రకటించందని వివరించారు. విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో కళాశాల జాయింట్ సెక్రటరీ ఎస్.ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్‌రామ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



బాలమ్మ (ఫైల్)

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పోలీస్ స్టేషన్ పరిధిలోని సాహెబ్‌నగర్ లోగల అంజమ్మ అపార్ట్‌మెంటులో ఉంటున్న స్వాల నగేశ్ తల్లి బాలమ్మ గత నెల 28 రోజున ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. అయితే బాలమ్మ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుమారుడు నాగేశ్ తల్లి కోసం తెలిసిన వారివద్ద వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



యువకుడి ఆత్మహత్య

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేటకు చెందిన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఓల్డ్‌మలక్‌పేటలో ఉండే సమీర్ హుస్సేన్ (23)ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. చాదర్‌ఘాట్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

